# మాయని గాయం..

◆ తుంగభద్ర ప్రకోపానికి కొట్టుకుపోయిన నాగల్‌దిన్నె బ్రిడ్జి

◆ నేటికి పద్నాలుగేండ్లు ◆ పూర్తయిన వంతెన పనులు

◆ ప్రయాణికులకు తీరిన ఏటి కష్టాలు


వరదలకు నేలమట్టమైన నాగల్‌దిన్నె వంతెన (ఫైల్)

అయిజ, అక్టోబర్ 1 : అక్టోబర్ 2 అనగానే సాధారణంగా అందరికీ గుర్తుకొచ్చేది మహాత్మాగాంధీ జయంతి.. కానీ ఇదే రోజున నడిగడ్డ ప్రజలకు వణుకు పుట్టింది. ఆనాడు రోజుల తరబడి గ్రామాలు, పట్టణాలకు సంబంధాలు తెగిపోయి కొన్ని జీవితాలే అతలాకుతలమై మాయని గాయాన్ని మిగిల్చింది. నడిగడ్డలో వరద బీభత్సం సృష్టించి పద్నాలుగేండ్లు గడిచినా ఆ సందర్భం ఇంకా నడిగడ్డ ప్రజల కండ్లముందే కదలాడుతున్నది. ప్రకృతి ప్రకోపానికి, కృష్ణా, తుంగభద్ర ఉప్పొంగి నడిగడ్డ అతలాకుతలమైంది. తుంగభద్ర ప్రకోపానికి జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్ సమీపంలోని నాగల్‌దిన్నె వంతెన నేలమట్టమైంది. అలంపూర్, అయిజ, వడ్డేపల్లి, మానవపాడు, గద్వాల మండలాల్లో వరద బీభత్సం సృష్టించి వేలాది మందిని నిరాశ్రయులను చేసింది.అయిజ మండలంలో తుంగభద్ర ఉధృతికి గ్రామాలు అతలాకుతలమయ్యాయి. 2009, అక్టోబర్ 2న సంభవించిన ఈ ఘటనలో వేలాదిమంది నిర్వాసితులయ్యారు. చేతికొచ్చిన పంట వేల ఎకరాల్లో నీటమునిగింది. కుటుకనూరు పూర్తిగా మునిగిపోగా, రాజాపురం, పులికల్, కేశవరం, వేణిసోంపురం, కిసాన్‌నగర్‌కు చెందిన భూములు కోతకు గురయ్యాయి.

### తీరిన ఏటి కష్టాలు..


ఈ వంతెనను పునర్నిర్మాణం జరుగక తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల ప్రయాణికులు నానా కష్టాలు పడ్డారు. పద్నాలుగేండ్ల పాటు పుట్టి ప్రయాణాలకు అనుమతుల్లేక అసంపూర్తిగా నిర్మించిన వంతెనపైకి నిచ్చెనల సాయంతో ఎక్కి నాగల్‌దిన్నె వరకు నడక సాగించారు. ఈక్రమంలో రాష్ట్ర సరిహద్దులో 2.09 ఎకరాల భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.18.40లక్షలు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భూసేకరణ పూర్తి చేయగా వంతెన పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం నాగల్‌దిన్నె వంతెన నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

### తుంగభద్ర నదిపై వంతెన..

తెలంగాణ – ఏపీలోని రాయలసీమ జిల్లాలను అనుసంధానం చేస్తూ తెలంగాణలోని పులికల్, ఏపీలోని నాగల్‌దిన్నె గ్రామాల మధ్య తుంగభద్రా నదిపై వంతెన నిర్మాణానికి 1993లో శంకుస్థాపన చేశారు. 1992లో వరదల నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణానికి పూనుకున్నారు. 1993లో పనులు మొదలైనప్పటికీ అధికారికంగా చేపట్టింది 2003లోనే. అప్పటి నుంచి 2009 అక్టోబర్ 2 వరకు రాకపోకలు జరిగాయి. ఆరోజున నది జలప్రళయానికి నాగల్‌దిన్నె వంతెన నేల మట్టమైంది. కాగా 2012లో బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ.42కోట్లతో మళ్లీ టెండర్లు పిలిచి 2013లో పనులు ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటుతో ప్రభుత్వం భూసేకరణకు నిధులు విడుదల చేయడంతో ఈ ఏడాది ఆగస్టులో వంతెన పనులు పూర్తయ్యాయి. దీంతో తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల ప్రయాణికులు సాఫీగా ప్రయాణాలు సాగిస్తున్నారు.

### ఎమ్మెల్యే అబ్రహం ప్రత్యేక శ్రద్ధ..

2018 డిసెంబర్‌లో అలంపూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన అబ్రహం నాగల్‌దిన్నె వంతెన పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపారు. కర్నూల్ కలెక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు మంత్రులు, ఎంపీలను కలిసి వంతెన పనులు పూర్తి చేయాలని కోరారు. సీఎం కేసీఆర్‌ను ప్రత్యేకంగా కలిసి బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన భూసేకరణకు నిధులు విడుదల చేయాలని కోరారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిసి వంతెన ఆవశ్యకతను వివరించారు. దీంతో తెలంగాణ, ఏపీ సీఎస్‌లు నిధుల విడుదలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో గద్వాల జిల్లా, అయిజ మండలం పులికల్, రాజాపూర్ గ్రామాల రైతులకు చెందిన 2.09 గుంటల భూసేకరణకు రూ.18.40 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో చర్యలు తీసుకుని 18 రైతులతో పలు దఫాలుగా చర్చించి భూసేకరణ పూర్తి చేశారు.


నాగల్‌దిన్నె వంతెన

## గడప గడపకూ సంక్షేమ ఫలాలు

◆ అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు

◆ జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి


పార్టీలో చేరిన కార్యకర్తలతో జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 1 : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ అందుతున్నాయని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. నవాబ్‌పేట మండలం కొండాపూర్‌కు చెందిన 50మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఆదివారం జడ్చర్లలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, జడ్చర్ల, నవాబ్‌పేట మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


## బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం

బాలానగర్, అక్టోబర్ 1 : బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని ఈదమ్మగడ్డతండా వార్డు మెంబర్ రవినాయక్‌తో సహా 10మంది కాంగ్రెస్‌ను వీడి కారెక్కారు. బీఆర్‌ఎస్ యూత్‌వింగ్ మండల ఉపాధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో రాజాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పథకాలు కొనసాగించాలంటే మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేయాలన్నారు. అదేవిధంగా పోచమ్మగడ్డ తండా జీపీ పరిధిలోని బయన్నగడ్డతండావాసులు బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడు రవిజాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వంగా కలిశారు. పెద్ద బావితండా జీపీ రోడ్లకు రూ.5.60కోట్లు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలుపుతూ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో తండావాసులు జడ్చర్లలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్, నరేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ అంటేనే సంక్షేమం


గ్రామపంచాయితీ భవనాని ప్రాంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే పట్నం

కోస్గి , అక్టోబర్ 1 : బీఆర్‌ఎస్ అంటే ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్న పార్టీ అని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోస్గి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, జీపీ భవనాలను వారు ప్రారంభించారు. కోస్గిలోని సర్జఖాన్‌పేట్‌లో ముదిరాజ్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన, కబరస్థాన్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాచారంలో ఆంజనేయస్వామి ఆలయ మండప నిర్మాణానికి శంకుస్థాపన, కబరస్థాన్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. చంద్రవంచలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ముంగిమళ్లలో జీపీ భవనాన్ని ప్రారంభించి రామస్వామి ఆలయం కింద నూతన షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. చెన్నారంలో జీపీ భవనాన్ని ప్రారంభించి బిజ్జారంలో శివాలయం, ఆంజనేయస్వామి, మీర్జాపూర్‌లో తిరుమల దేవుని ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేసి, జీపీ భవనం, ప్రైమరీ, హైస్కూల్ భవనాలను ప్రారంభించారు. అనంతరం మీర్జాపూర్‌లో కోపుగుంతలో పడి బాలుడు మృతి చెందగా ఎమ్మెల్యే, ఎంపీ, బీఆర్‌ఏస్ నాయకులు, విద్యార్థులతో కలిసి 2 నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమాల్లో స్టేట్ ఈజీఎస్ డైరక్టర్ ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామకృష్ణ, జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ మధుకర్‌రావు, వైస్ ఎంపీపీ సాయిలు, రైతుబంధు సమి తి మండల అధ్యక్షుడు హన్మంతురెడ్డి, కోస్గి మున్సిపాలిటీ అధ్యక్షుడు రాజేశ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సర్జఖాన్‌పేట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 1 : జిల్లాకేంద్రంలోని స్థానిక స్టేడియం మైదానంలో అండర్-19 ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక ఆదివారం నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాపిరెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, వారికి బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో రాణించి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఖలీల్, ముకుర్రం తదితరులు పాల్గొన్నారు.

**జట్టు వివరాలు..**

బాలురు..

అబ్దుల్ రాఫె, మహ్మద్ సాధిక్, భానుప్రకాశ్, సయ్యద్ జోహ్రన్, మహబూబ్, సయ్యద్ ఉజేర్, అభిషేక్, చరణ్, విశ్వక్‌రెడ్డి, గణేశ్, సయ్యద్ నూమన్ అలీ, సయ్యద్ సాదత్, నితీన్

బాలికల జట్టు..

శ్రీలత, స్వప్న, మంజుల, నందిని, వర్షిణిరెడ్డి, అంజలి, సోని, తన్విక, వసంత, రిదత బసుమ్, మిస్రాబేగం, సబత్తసిన్


అండర్-19 ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు

## 'విజయవర్ధిని'కి మహర్దశ

◆ రూ.150 కోట్లతో పునరుద్ధరణ పనులు

◆ నేడు మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన

◆ ఉమ్మడి జిల్లాలో రైతులకు ప్రయోజనం


విజయవర్ధిని ఆయిల్ మిల్

అలంపూర్, అక్టోబర్ 1: జిల్లాలోని ఎర్రవల్లి చౌరస్తా వద్ద గల విజయవర్ధిని ఆయిల్ మిల్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మిల్లు పునరుద్ధరణకు రూ.150కోట్లు కేటాయించింది. టీఎస్ ఆయిల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మిల్లును నిర్వహించనున్నారు. ఈనెల 3న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా భూమిపూజ కార్యక్రమం చేయనున్నారని ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచెర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో జాతీయ రహదారి బీచుపల్లి క్షేత్రం పరిసరాల్లో 1990 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూ.18 కోట్ల ఖర్చుతో 100 టన్నుల రిఫైనరీ ప్లాంట్,100 టన్నుల సామర్థ్యం గల సాల్వేంట్ ఆయిల్, 200 టన్నుల సామర్థ్యం గల నూనె ఉత్పత్తి చేయగల మిల్లును 100 ఎకరాల్లో ఈ మిల్లును ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలు పాలమూరు, నల్లగొండ, కర్నూలు జిల్లా రైతులకు మద్దతు ధర ఇస్తూ నూనె ఉత్పత్తి గింజల పంటలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెలకొల్పారు. కొన్నేళ్లు సజావుగా కొనసాగింది. అధికారుల చేతివాటం, ప్రభుత్వ ఉదాసీనత వల్ల 2003లో మిల్లు మూతపడింది.

### ఆయిల్ పాం తోటల సాగుకు ప్రోత్సాహం

రాష్ట్రంలో నూనె ఉత్పత్తులు పెంచి అందరికీ అందుబాటులో సరసమైన ధరలకు నాణ్యమైన ఆయిల్ అందించాలని ప్రభుత్వం పామాయిల్ తోటల పెంపకంపై రైతులకు రాయితీ ఇస్తోంది. అంతే కాకుండా పండిన ధాన్యాన్ని విక్రయించడానికి అందుబాటులో నూనె ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది.

### పెరగనున్న ఉపాధి అవకాశాలు

జిల్లాలో ఆయిల్ మిల్లు ప్రారంభం తర్వాత ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా మరో 1500 మందికి ఉపాధి లభించనుంది. ప్రభుత్వం మిల్లును అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించనున్నారు. గంటకు 30 టన్నులు, రోజుకు 600 టన్నుల పామాయిల్ గెలలను వేరు చేసి క్రషింగ్ చేస్తారు. రోజుకు 100 టన్నుల వరకు ఉత్పత్తి ద్వారా వచ్చిన క్రూడ్ ఆయిల్‌ను భాగ్యనగరంలోని శివరాంపల్లి ఆయిల్ ఫెడ్ మిల్లుకు తరలించే ఏర్పాటు చేయనున్నారు.

## గుంతలో పడి బాలుడు మృతి

కోస్గి రూరల్, అక్టోబర్ 1 : ఆడుకుంటూ వెళ్లి గుంతలో పడి బాలుడు మృతి చెందిన ఘటన కోస్గి మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు మీర్జాపూర్ గ్రామానికి చెందిన చంద్రమ్మ, కిష్టప్ప దంపతుల మూడో సంతానం కార్తీక్(10) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్నం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.